క్లుప్తంగా

మొదటి గిరిజన సంస్కృత అధ్యాపకుడిగా లింగానాయక్



మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర మొదటి గిరిజన సంస్కృత అధ్యాపకుడిగా మండలంలోని బావోజిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకూరం తండాకు చెందిన గుగులోతు లింగానాయక్ నియామకం అయ్యాడు. ఈమేరకు గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ప్రజా ప్రభుత్వంలో కొలువుల పండుగ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నాడు.

మిర్చి, మక్కలకు గిట్టుబాటు ధర చెల్లించాలి

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి, మక్కలకు గిట్టుబాటు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి మేక వీరన్న డిమాండ్ చేశారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన ఏఐకేఎస్ మండల మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల రైతులు గోస పడుతున్నారన్నారు. మిర్చి క్వింటాకు రూ.25వేలు, మక్కలు క్వింటాకు రూ.3వేలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, తండా సందీప్, వీర స్వామి, యాకయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సై



మహబూబాబాద్ రూరల్: ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను డోర్నకల్ 3వ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బి.నాగేశ్వర్ రావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

శ్రీ హయగ్రీవ యజ్ఞం



మహబూబాబాద్ రూరల్: అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవ పూజల్లో భాగంగా ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యుల పర్యవేక్షణలో గొడవర్తి శ్రీనివాసచార్యులు యాజ్ఞిక నిర్వహణలో మూడోరోజు గురువారం సుప్రభాత సేవ, సేవాకాలం, నివేదన, వేద విన్నపం జరిపి అనంతరం ద్వారా తోరణ, ధ్వజ కుంభారాధన, చతుస్థానార్చన, నిత్య హవనం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయిని ప్రభాకర్ రెడ్డి, మాలే కాశీనాథ్, మల్యాల రంగారావు, అర్చకులు అనిరుద్ ఆచార్యులు, విశ్వం, రవికిరణ్ ఆచార్యులు, మట్టపల్లి విజయ్ గౌతమ్, చరణ్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నెల్లికుదురు: డబ్ల్యూటీఎల్ఎం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రాజులకొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు హెచ్ఎం స్వరూపరాణితో కలిసి అందించారు. సంస్థ అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి మాట్లాడుతూ.. మనోధైర్యంతో పరీక్షలు ప్రశాంతంగా రాయాలని విద్యార్థులకు సూచించారు.

పెద్దవంగర: విద్యార్థుల జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమని సీడబ్లూసీ చైర్‌పర్సన్ నాగవాణి, పెద్దవంగర లయన్స్‌క్లబ్ ఆఫ్ సేవా తరుణి అధ్యక్షురాలు మాదవపెద్ది వాణి అన్నారు. గురువారం మండలంలోని చిన్నవంగర కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం స్రవంతి, ప్రతినిధులు పద్మ, శైలజ, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సరిత, కల్యాణి పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 538/1 లో గల గిరిజన మహిళ దుంగ్రోత్ భూబికి చెందిన భూ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. గిరిజన మహిళకు సంబంధించిన భూమిని గురువారం సీపీఐ బృందం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్, రెవెన్యూ అధికారులు క్లియరెన్స్ ఇచ్చారని, ఇంటి నిర్మాణానికి సైతం పర్మిషన్లు ఇచ్చిన అధికారులు గిరిజన మహిళకు చెందిన ఇంటి నిర్మాణ పనులను నిలిపి వేయాలని చెప్పడం సరికాదన్నారు. కార్యక్రమంలో గీత్ అవినాస్, నవీన్, శోభా, యాకుబ్, మధు, గోపి, సీపీఐ పట్టణకార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శిరేషపల్లి నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతకుంట్ల వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

పంటలు ఎండుతున్నాయ్!

- అడుగంటిన భూగర్భ జలాలు..
- నీటి కోసం బావుల్లో పూడికతీత
- పంటలను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

డోర్నకల్: తీవ్రమైన ఎండలతో భూగర్భ జలాలు అడుగంటి ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. మండలంలోని ముల్కలపల్లి, రావిగూడెం, సీరోలు మండల పరిధిలోని మన్నెగూడెం, అందనాలపాడు, చిలుకొయ్యలపాడు గ్రామాల పరిధిలో ఎండలతో వరిపంట ఎండుతుండడంతో రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సుమారు ఏడేళ్ల తరువాత రైతులు తమ వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వానాకాలం వరి పంట సాగు చేసి యాసంగిలో మళ్లీ వరి పంటనే సాగు చేస్తుండడంతో నీటి కొరత ఏర్పడుతోంది. ఆరుతడి పంటల సాగుతో ప్రయోజనాలపై రైతులు అవగాహన పొందాలని అధికారులు చెబుతున్నారు.

తొర్రూరు రూరల్: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న అనేక రకాల పంటలకు సరిపడా సాగునీరు అందక ఎండిపోతున్నాయి. తొర్రూరు, పెద్దవంగర మండలాల వ్యాప్తంగా రబీలో సుమారు 5వేల హెక్టార్ల వరి, పత్తి, మొక్కజొన్న, మిరప పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా బోర్లు, బావులు, ఆకేరు, పాలేరు వంటి వాగుల్లో ఉన్న బోర్లకింద సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న మిరప పంటల దిగుబడి చివరి దశకు చేరుకున్న సమయంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోతుండడంతో బోర్లు, బావుల నుంచి సరిపడ సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రధానంగా ఎస్సారెస్పీ జలాలను రెండు, మూడురోజులపాటు విడుదల చేయకుండా, సుమారు నెలరోజులపాటు విడుదల చేసి చెరువులు, కుంటలు మత్తళ్లు పడే విధంగా నింపాలని రైతులు కోరుతున్నారు.



డోర్నకల్: మన్నెగూడెం సమీపంలో బావిలో పూడికతీత పనులు



డోర్నకల్: అందనాలపాడు సమీపంలో ఎండిన పొలం



తొర్రూరు రూరల్: అమ్మాపురం గ్రామ శివారులో ఎండిపోతున్న వరి

విద్యార్థుల హోలీ సంబురాలు



కేసముద్రం: శ్రీవివేకవర్ధిని హైస్కూల్‌లో హోలీ సంబురాలు



నెల్లికుదురు: మునిగలవీడు ప్రాథమిక పాఠశాలలో..



గూడూరు: అరవింద విద్యాలయంలో..



బయ్యారం: అల్లిగూడెం పాఠశాలలో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు ముందుస్తు హోలీ వేడుకలు జరుపుకున్నారు. రంగులను చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - కేసముద్రం/బయ్యారం/నెల్లికుదురు/ గూడూరు

పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలి

- మున్సిపల్ మాజీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఉచిత బస్సు పాస్ మినహా మిగిలిన పథకాలు అమలు చేయలేదని, పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని మున్సిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ 60శాతం కూడా కాలేదని అది కూడా రెండు ఎకరాలలోపు ఉన్న వారికి ఇచ్చారని దానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఏడాదిన్నర కావస్తున్నా నేటికి పాలనపై స్పష్టత లేని కనీసం ప్రణాళిక లేకుండా ముందుకు పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని కోల్పోతుందని రాబోయో ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు రంగారావు, నాయిని రంజిత్, తేళ్ల శ్రీను, రఘు, అశోక్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మహబూబాబాద్: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు కంపెనీల్లో ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ కోసం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. వివరాల కోసం 96033 12002ను సంప్రదించాలని కోరారు.

ప్రపంచ కిడ్నీ దినోత్సవం



నెహ్రూసెంటర్: మానుకోటలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ఆర్ఎంఓ జగదీశ్వర్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో కిడ్నీ చాలా ముఖ్యమైనదన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, డయాలసిస్ ఇన్‌చార్జ్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాగర్జన సభను జయప్రదం చేయాలి



పార్టీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శంకర్‌నాయక్

నెల్లికుదురు: ఈనెల 27న వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మహాగర్జన సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ మహాగర్జన సభ వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించి కార్యకర్తలు, నాయకులకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, మాజీ జెడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు భూక్య బాలాజి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌రావు సేవలు మరువలేనివి

తొర్రూరు: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు సేవలు మరువలేనివని తొర్రూరు మాజీ సర్పంచ్ పెదగాని సోమయ్య అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ నెమరుగొమ్ముల సుధాకర్‌రావు ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆయన అభిమానుల ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సుధాకర్‌రావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

చిరస్మరణీయుడు సుధాకర్‌రావు

పెద్దవంగర: దివంగత నేత మాజీ ఎమ్మెల్యే నెమరుగొమ్ముల సుధాకర్‌రావు చిరస్మరణీయుడని కొడకండ్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ముత్తినేని రమ శ్రీనివాస్, చిట్యాల మాజీ సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో డాక్టర్ సుధాకర్‌రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున చారి, కుమార స్వామి, ఊషయ్య, శ్రీనివాస్, రమేష్, రామరాజు, జనార్దన్, సుభాష్ పాల్గొన్నారు.



తొర్రూరు: సుధాకర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న స్థానికులు

బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసేలేదు



మాట్లాడుతున్న పాపారావు

కేసముద్రం: కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చినా, నేటి వరకు బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఊసే ఎత్తడం లేదని సీపీఎం జిల్లా నాయకులు మార్తనేని పాపారావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11ఏళ్ల పాలనలో మోదీ ప్రభుత్వం నూతన ప్రభుత్వ సంస్థలను నిర్మించకపోగా, ఉన్న ప్రభుత్వ సంస్థలను బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని విమర్శించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమ కనబరుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, మోడెం వెంకటేశ్వర్లు, బొబ్బాల యాకుబ్‌రెడ్డి, చాగంటి కిషన్, తాడబోయిన శ్రీశైలం, సావిత్ర, నీరుటి జలేందర్, ఎల్లయ్య, జల్లె జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యసాధన

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: క్రమశిక్షణ, కఠిన సాధన, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధించవచ్చని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గ్రూప్–2 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 25వ ర్యాంక్ సాధించిన ఎస్సై కె.శివను ఎస్పీ సన్మానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జరిగిన సన్మానం సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహబూబాబాద్ టౌన్ ఎస్సైగా శివ తన విధులు నిర్వహిస్తూ చదువుపై ఆసక్తి కనబరచి ఉన్నత ర్యాంక్ సాధించడం, ఇతర పోలీసు అధికారులకు ప్రేరణగా నిలుస్తుందని ఎస్పీ ప్రశంసించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ నరేందర్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, టౌన్ సీఐ దేవేందర్, ఆర్ఐలు నాగేశ్వరరావు, అనిల్ పాల్గొన్నారు.



ఎస్సై శివను సన్మానిస్తున్న ఎస్పీ

సంక్షిప్త సమాచారం

ప్రభుత్వం విఫలం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భాషాపాక పవన్, గుండ్ల రాకేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం సందర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, చందు, వంశీ, అరుణ్, మహేష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కేసముద్రం: ఈనెల 20న చేపట్టనున్న చలో కలెక్టరేట్ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం అన్నారు. గురువారం మండలంలోని కల్వల గ్రామంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస్, వెంకన్న, మల్లేశం, సుధాకర్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

గంగారం: తెలంగాణ రాష్ట్ర స్పీకర్‌ను ఏకవచనంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఉమ్మడి మండలాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిళి డిమాండ్ చేశాడు.

పేదలకు బడ్జెట్‌లో 30శాతం టాయించాలి

నెల్లికుదురు: నిరుపేద ప్రజలకు బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని పేదల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిరగాని భిక్షపతి గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. గురువారం మాట్లాడారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

గూడూరు: ఉమ్మడి వరంగల్ జిల్లా హన్మకొండ కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 23న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగనున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్, మహేందర్, సురేందర్, వీరన్న పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ తెలిపారు. వెన్నారం గ్రామ సమీపంలోని వాగు నుంచి గురువారం రాముతండాకు చెందిన బానోత్ కోక్యా తన ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

దంతాలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు గురువారం ఎస్సై పిల్లల రాజు తెలిపారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలోని పాలేరు వాగునుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం, ముకుందాపురం గ్రామానికి చెందిన ఆలేరు మహిపాల్ రెడ్డి, కొరిపెల్లి అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలికలకు వైద్యపరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో చురుకుగా ఉంటారని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల హెచ్ఎం పొడుగు నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాలల స్వాస్థ ఆధ్వర్యంలో బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య, హాస్టల్ హెచ్‌డబ్ల్యూ అనిత, ఏఎన్ఎంలు లావణ్య, శ్యామల పాల్గొన్నారు.

కార్యదర్శికి వినతి

దంతాలపల్లి: మండల కేంద్రంలో దోమల సమస్య పరిష్కరించి ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరుతూ గ్రామ కార్యదర్శి వెంకన్నకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సుతారపు అర్జున్, బుర్ర ముత్తు పాల్గొన్నారు.

అలరిస్తున్న నాటక పోటీలు

తొర్రూరు: చైతన్య కళా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని గరుగుబావి వద్ద మూడు రోజులుగా కొనసాగుతున్న జాతీయస్థాయి తెలుగు ఆహ్వానిత నాటక పోటీలు అలరిస్తున్నాయి. మూడోరోజు గుంటూరు జిల్లా ఉషోదయ కళానికేతన్ వారి 'కిడ్నాప్' నాటిక, కరీంనగర్ చైతన్య కళాభారతి వారిచే 'ఖరీదైన జైలు' నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో కళా సమాఖ్య అధ్యక్షుడు మన్నూరు ఉమ, ప్రధాన కార్యదర్శి సుంకరనేని పినాకపాణి, అసోసియేట్ అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల జాబితాలో నుంచి పేరు తొలగించారు



మరిపెడ రూరల్: ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో నుంచి తమ పేరు, తన కుమారుల పేర్లను తొలగించారని మండలంలోని వెంకట్యతండాకు చెందిన బాధితురాలు జర్పుల సోన, జాల్య దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం మండలంలోని వెంకట్యతండాలో ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం పై సర్వే అధికారి అయిన కార్యదర్శి రామోజీని వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్వే చేసి లబ్ధిదారుల గుర్తించామని, ఎవరు మాటలు నమ్మి ఎవరి పేర్లు తొలగించలేదన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

డోర్నకల్: ఎస్‌జీఎఫ్ఐ అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వనపర్తి స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గురువారం ఏడుగురు విద్యార్థులు వెళ్లారు. విద్యార్థులను హెచ్ఎం బండి నర్సింహారావు, పీడీ రవికుమార్ అభినందించారు.

నాటుసారా పట్టివేత

డోర్నకల్: మండలంలోని రామకుంటతండా సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 15లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు డోర్నకల్ ఎస్సై వంశీధర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రామకుంటతండాకు చెందిన తేజావత్ రాంబాబు, సునీత దంపతులు ద్విచక్ర వాహనంపై 15లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు దంపతులను అదుపులోకి తీసుకుని నాటుసారాతోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



పెద్దవంగర ప్రాథమిక పాఠశాలలో..



తొర్రూరు రూరల్: మదూరు స్కూల్‌లో..



నెల్లికుదురు: పార్వతమ్మగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో..

పెద్దవంగర: మండల కేంద్రంతో పాటు మండలంలోని పోచారం గ్రామ ప్రాథమిక, కొరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల్లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు.

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమదూరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు.

నెల్లికుదురు: మండలంలోని పార్వతమ్మగూడెం ప్రాథమీకోన్నత పాఠశాలలో స్వయం పరిపాలన వేడుకలు నిర్వహించారు.

బస్సు ఎక్కేవారు, దిగేవారు లేరు..



అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరి రోడ్డువైపు ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు, ఇటీవల కాలంగా ఆర్టీసీ బస్సులు వచ్చి, వెళ్తున్నాయి. అయితే బస్టాండ్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, కనీస సౌకర్యాలు లేకపోవడంతో బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోవడం లేదు. అదే రీతిలో బస్టాండ్ ఊరి చివరలో ఉండడంతో ప్రయాణికులు ఇక్కడ దిగడం లేదు. కేవలం ఆర్టీసీ బస్సులు అలా వచ్చి, ఇలా వెళ్తున్నాయే తప్పా, బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చుని, బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా బస్టాండ్‌లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా 'కాముడి దహనం'



కాముడి దహనం చేస్తున్న యువకులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయం ఎదుట యువకులు గురువారం రాత్రి కాముడి దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హోలీ పండుగను పురస్కరించుకుని ముందు రోజు కాముని దహన వేడుకలను నిర్వహించి మంటలను వెలిగించారు. కార్యక్రమంలో కరణం ముత్తయ్య, ఇరుగు వీరభద్రం, హోటల్ వెంకన్న, ముత్యాల గౌతం, గద్దెపల్లి రాకేష్, అప్పాల వెంకన్న, దడిగల సూరి, రాజేందర్, కందగట్ల నాగరాజు పాల్గొన్నారు.